సాక్షి
మంచిర్యాల
గురువారం। 23। మార్చి। 2023



ప్రభుత్వ భూమి కబ్జాపై పట్టింపేది !

ప్రభుత్వ, చెరువు భూముల కబ్జాపై అధికారుల కు పట్టింపు కరువైంది. దీంతో అధికారుల వైఖ రిని నిరసిస్తూ ప్రజలు గుడిసెలు వేసుకునేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశమైంది. 8లో ▸



ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి ఆల యంలో బుధవారం ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం ఆధ్వర్యం లో భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలం బ్రాల కౌంటర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దివాకర్ రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి.

ఘనంగా ఉగాది వేడుకలు


పచ్చడి తీసుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు


భీమారం: వ్యవసాయ పనులకు రైతు శ్రీకారం


విశ్వనాథ ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు బుడి దామోదర్‌శర్మ సిద్ధాంతి


దండేపల్లి: కస్తూర్బా పాఠశాలలో ఉగాది వేడుకలు


శ్రీరాంపూర్: ఆర్కే 7గనిపై పూజల్లో కార్మికులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. రైతులు వ్యవసాయ పనులు పనులు ప్రారం భించారు. మంచిర్యాలలోని విశ్వనాథ ఆల యంలో బుధవారం రాత్రి బుడి దామోదర్‌సి ద్ధాంతి పంచాంగాన్ని ఆవిష్కరించారు. అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాల తో ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాసవిక్లబ్, వాసవి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో బూరెలు పం పిణీ చేశారు. ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు, వేద పండితులు అరుణ్‌శర్మ, దినేష్‌శర్మ, ఆలయం ఈవో ముక్తా రవి, అర్చకులు నరహరిశర్మ, బాలకృష్ణ, గోవర్ధనం భట్రాచార్య, వాసవిక్లబ్ గవర్నర్ కొండ చంద్రశేఖర్, ఆలయ రెనోవే షన్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.


మందమర్రిరూరల్: పట్టణంలో జరిగిన ఉగాది ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

న్యూస్‌రీల్

సీపీఆర్‌పై పోలీసులకు శిక్షణ ఇప్పించాలి


డీసీపీకి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు లందరికీ గుండె పునర్‌నిర్మాణం(సీపీఆర్)పై శిక్షణ ఇచ్చేలా చూడాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చం దూరి మహేందర్ మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను కోరారు. ఈ మేరకు బుధవా రం వినతిపత్రం అందజేశారు. సీపీఆర్ శిక్షణ తో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించేం దుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

కాళేశ్వరంలో చెన్నూర్ కవులకు సన్మానం

చెన్నూర్: కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయం అభిషేక మండపంలో శోభకృత్ నామ సంవత్స రం సందర్భంగా చెన్నూర్ పట్టణానికి చెందిన మంచిర్యాల జిల్లా రచయిత సంఘం అధ్యక్షు డు, కార్యదర్శులు బొడ్డు మహేందర్, దబ్బెట రాజమల్లు, మామిడి అక్షితలను ఆలయ సమి తి సభ్యులు సంజీవరావు, గద్దం లక్ష్మయ్య, మా డుగుల భాస్కర్‌శర్మ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కవులు మాట్లాడుతూ ప్రాంతాలకు అతీతంగా ఆలయ కమిటీ సమితి సభ్యులు కవులను అరుదైన గౌరవాన్ని ఇచ్చా రని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో 'పది' మూల్యాంకన కేంద్రం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో పదో తర గతి స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం కేటాయిం చారు. పరీక్షలు ముగిసిన వెంటనే వీలైనంత త్వరగా ఫలితాలు వెల్లడించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏప్రిల్ 3న పరీక్షలు ప్రారంభం కానుండగా.. మూల్యాంకన ప్రక్రియపై చర్య లు వేగవంతం చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఆరు మూల్యాంకన కేం ద్రాల ఏర్పాటుకు తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ సుముఖత వ్యక్తం చేశారు. ఇందులో జిల్లాకు కేంద్రం కేటాయించారు. దీంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తొలగనున్నాయి. ఇదివరకు పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఆదిలాబాద్‌లో ఉండడంతో టీచర్లు అనేక సమస్యలు ఎదుర్కొ న్నారు. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్ దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉండడం తో మూల్యాంకనానికి వెళ్లేందుకు విముఖత చూపేవారు. చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జా మినర్‌గా నియమించిన వారందరూ ఆదిలాబాద్‌కు వెళ్లినా వసతి, భోజనం లభిం చక ఎన్నో ఇక్కట్లకు గురయ్యారు. ముఖ్యంగా మహిళా టీచర్ల వేదన వర్ణనాతీతం. ఒక్కోసారి పది రోజుల్లో జరిగే స్పాట్ వాల్యూయేషన్ పదిహేను రోజులు వరకు కొనసాగేదని టీచర్లు తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారింది. మంచిర్యాలలో మూల్యాంకన కేం ద్రం ఉండడంతో ఎగ్జామినర్‌లు అందుబాటు లో ఉంటారు. నిర్ణీత సమయంలో మూల్యాం కనం పూర్తయ్యే అవకాశాలున్నాయి. మూల్యాం కన ప్రక్రియ పలు దశల్లో జరగనుంది. తొలు పరీక్ష కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాలను మూల్యాంకన కేంద్రానికి 20 చొప్పున కట్టగా కట్టి తెస్తారు. చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జా మినర్, స్పెషల్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెం ట్లు, ప్రత్యేక సిబ్బందిగా ప్రభుత్వ ఉపాధ్యా యులను విధుల్లోకి తీసుకుంటారు. స్థానిక కార్మెల్ హైస్కూల్‌లో పదో తరగతి మూల్యాం కన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఓ అధికారి సూచనప్రాయంగా వెల్లడించారు.

పల్లెల్లోనూ గన్‌కల్చర్..!

- జిల్లాలో పెరుగుతున్న తుపాకుల వినియోగం
- అక్రమ దందాలకు అడ్డొస్తే ఆయుధాలతోనే సమాధానం
- ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి
- నిద్రావస్థలో నిఘా వర్గాలు

మంచిర్యాలక్రైం: జిల్లాలో రోజు రోజుకు తుపాకుల వినియోగం పెరిగిపోతోంది. పట్టణాలు, ప్రధాన నగరాల్లో అక్కడక్కడ కనిపించే గన్‌కల్చర్ ఇప్పుడు పల్లెలకూ పాకింది. సెటిల్‌మెంట్లు, బలవంతపు వసూళ్లు, ఆధిపత్య పోరు, అక్రమ దందాలు, నకిలీ మావోయిస్టుల వేషాలకు ఏకంగా తుపాకులు వినియోగించడం ప్రజల్లో భయాందోళన కలిగిస్తుం డగా.. పోలీసులకు సవాల్‌గా మారుతోంది. లక్సెట్టి పేట మండలం ఇటిక్యాలకు చెందిన మేడి వెంకటేష్, తన స్నేహితుడు ఆరెందుల రాజేష్‌లు హైదరాబాద్ లో ఎయిర్‌గన్‌లు రెండు కొనుగోలు చేసి గత నెల 22న మావోయిస్టుల పేరిట అదే గ్రామానికి చెందిన గుండ కాంతయ్యను బెదిరించిన ఘటన సంచలనం సృష్టించింది. జిల్లాలో అక్రమ దందా చేసేవాళ్లు ఆయుధాలను వినియోగిస్తున్నారన్న ఆరోప ణలున్నాయి. జిల్లాలో ఎక్కువగా స్థిరాస్తి గొడవలు, వివాహేతర సంబంధాలు, కుటుంబ ఆస్తి తగాదాలకు సంబంధించిన నేరాలు జరుగుతు న్నాయి. జిల్లా కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాపై కన్నేసిన వారు, అక్ర మదందాలకు పాల్పడేవారు మంచిర్యాలను స్థావ రంగా చేసుకుని అక్రమదందాలు, సెటిల్‌మెంట్లు సాగిస్తున్నారు. గుట్కా, గంజాయి, నకిలీ విత్తనాలు, ల్యాండ్ మాఫియా ముఠాలు పెట్రేగిపోతున్నాయి. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలిపే రైల్వేలైన్ జిల్లా మీదుగా వెళ్తుండడంతో నేరాలు చేసి క్షణాల్లో తప్పిం చేకునే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో ఇతర


ఈ నెల 16న పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎయిర్ గన్స్(ఫైల్)

రాష్ట్రాల నేరస్తులు సైతం జిల్లాను అడ్డాగా మార్చు కుంటున్నారు. గత ఏడాది ఆగస్టు 20న గోదావరిఖ నిలోని గంగానగర్‌లో సింగరేణి కార్మికుడు రాజేంద ర్‌ను తుపాకితో కాల్చిచంపిన ఘటనలో జిల్లా కేం ద్రం మంచిర్యాలకు 15కిలోమీటర్ల దూరంలోని కిష్టంపేటకు చెందిన రాజు, సయ్యద్ పాత్రధారులు కావడం, వీరికి తుపాకి సమకూర్చింది ఓ విలేకరిగా తేలడంతో తీవ్ర సంచలనం సృష్టించింది. గతంలో జిల్లా కేంద్రంలో పానీపూరి వ్యాపారం చేసే వ్యక్తి వద్ద తుపాకి లభించడం, వ్యభిచారం ముఠా నిర్వహి స్తున్న వ్యక్తి వద్ద, రియల్‌ఎస్టేట్ వ్యాపారి వద్ద ఇలా చాలా ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

బోపాల్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి తుపాకులు, కత్తులు కొనుగోలు చేసి జిల్లాలోకి తీసు కొస్తున్నట్లు సమాచారం. కొందరు మాజీ మావోయి స్టుల సహకారంతో అక్రమ దందాలకు పాల్పడుతు న్నారు. కొందరు రియల్టర్లు ఎయిర్‌గన్స్, తుపాకులు కొనుగోలు చేసినట్లు ప్రచారంలో ఉంది. ఆయా రాష్ట్రాల్లో అతి తక్కువ ధరకు గన్స్(షార్ట్ వెపన్) రివాల్వర్లు రూ.20వేల నుంచి రూ.30వేలకు దొరుకు తుండడంతో కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

నిఘా వైఫల్యం..?


చెన్నూర్‌లో నకిలీ మావోయిస్టుల వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న రివాల్వర్(ఫైల్)

జిల్లాలో తుపాకులు, తల్వార్లు, కత్తులు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుండగా.. నిఘా వర్గాల వైఫల్యం కారణమనే ఆరోపణలున్నాయి. మేడి వెంక టేష్, ఆరెందుల రాజేష్ ఎయిర్‌గన్స్ కొనుగోలు చేసి జిల్లాలో హల్‌చల్ చేసే వరకు పోలీసు, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ నిఘా వర్గాల దృష్టికి రాకపోవడం విమర్శ లకు తావిస్తోంది. ఏదైనా ఘటన జరిగినప్పుడే ఆరా తీస్తుండడం పరిపాటిగా మారింది. మూలాలను వెలికి తీయడంతో విఫలం అవుతున్నారనే విమర్శ లున్నాయి. ఫలానా వ్యక్తుల వద్ద తుపాకులు ఉన్నా యనే సమాచారం సాధారణ ప్రజలకు తెలుస్తున్నా.. పోలీసు నిఘా వర్గాలకు ఆ సమాచారం చేరకపో వడం వైఫల్యాన్ని తెలియజేస్తోంది.

గతంలో వెలుగులోకి వచ్చిన ఘటనలు

- 2005లో మంచిర్యాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఓ ఇంట్లో పట్టపగలే రియల్ ఎస్టేట్ వ్యాపారి బొద్దున రామస్వామని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తుపాకితో కాల్చి చంపారు.
- 2016 నవంబర్ 15న మంచిర్యాలలో పానీపూరి విక్రయించే ప్రసాద్, రవి వద్ద నాటు తుపాకి, రెండు బుల్లెట్లను పోలీసు లు స్వాధీనం చేసుకున్నారు.
- గతంలో మంచిర్యాలకు చెందిన ఓ కారు డ్రైవర్ వేణుగోపాల్ నుంచి తుపాకిని స్వాధీనం చేసుకున్నారు.
- 2012లో శివకుమార్ అనే వ్యక్తి నుంచి తపంచా, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- 2017లో లక్సెట్టిపేట మండలం చం దారానికి చెందిన మల్లారెడ్డి సెటిల్‌మెంట్లు చేసేందుకు వచ్చి మంచిర్యాలలో బాధితు లను రివాల్వర్‌తో బెదిరించిన కేసులో ఓ స్థానిక లాడ్జిలో పోలీసులకు చిక్కాడు.
- 2019 అక్టోబర్‌లో వేమనపల్లి మండలం మంగినిపల్లికి చెందిన బొమ్మ చంద్రశేఖర్ రెడ్డి, నీల్వాయికి చెందిన నవీన్‌రెడ్డి, చెన్నూ ర్‌కు చెందిన తోడే రాజేశ్వర్‌రెడ్డి ముఠాగా ఏర్పడి మావోయిస్టుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డ కేసులో ఒక తుపాకి, 9బుల్లెట్లు పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. ఈ తుపాకిని బీహార్‌లో రూ.32వేకు కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
- ఈ నెల 16న లక్సెట్టిపేట మండలం ఇటి క్యాలకు చెందిన మేడి వెంకటేష్, పెద్దంపే టకు చెందిన ఆరెందుల రాజేష్ నుంచి సీసీసీ పోలీసులు రెండు ఎయిర్‌గన్స్ స్వాధీనం చేసుకున్నారు.

అటు 'వెలుగు'.. ఇటు పక్షోత్సవాలు

- అయోమయంలో అంగన్‌వాడీ టీచర్లు
- ఇప్పటికే కంటివెలుగు విధులు
- పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు ప్రారంభం
- వచ్చే నెల 3వరకు అవగాహన కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఓ వైపు కంటివెలుగు శిబి రాలు నిర్వహిస్తుండగా.. మరోవైపు పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే అంగ న్‌వాడీ టీచర్లు కంటి వెలుగు శిబిరాల్లో సేవలు అంది స్తుండగా.. పక్షోత్సవాల నిర్వహణ తీరుపై అయోమ య పరిస్థితి నెలకొన్నాయి. మహిళా శిశు సంక్షేమ శా ఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే 3వరకు పో షణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. పౌష్టికాహారం ప్రాముఖ్యత, గర్భిణుల ఆరోగ్య రక్ష ణ, రక్తహీనత నివారణ, పిల్లల పెరుగుదల పర్యవేక్ష ణ, పరిశుభ్రత, చిన్నారులు, గర్భిణులు, బాలింత లు, బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేం దుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉం టుంది. కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్య త, తీసుకునే ఆహారంపై ఆరోగ్యం ఆధారపడి ఉం టుందని, పౌష్టికాహారం తీసుకుంటేనే శారీరక వికా సం సాధ్యమవుతుందని, లేనిపక్షంలో రుగ్మతల బా రిన పడే ప్రమాదం ఉందని వివరించాల్సి ఉంటుం ది. కానీ సరైన అవగాహన లేక, పేదరికం కారణంగా చాలామంది పౌష్టికాహార లోపంతో రోగాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారం, ఆవశ్యకత ను వివరించడానికి జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఉన్న 969 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐసీ డీఎస్ అధికారులు ఏర్పాట్లు చేసినా కంటివెలుగు శిబిరం నిర్వహించే ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లకు


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వండిస్తూ అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

విధులు కేటాయిస్తున్నారు. కంటి వెలుగుతోపాటు ఇతర అదనపు బాధ్యతల నుంచి తప్పిస్తే పక్షోత్స వాలు విజయవంతం చేసి, బరువు తక్కువగా ఉన్న పిల్లలు, తల్లులు, గర్భిణులు ఎలాంటి ఆహారం తినాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభిం చే వంటకాలపై అవగాహన కల్పించేందుకు అవ కాశం ఉంటుంది.

ప్రత్యేక కార్యక్రమాలు

పక్షోత్సవాలు ఈ నెల 20నుంచి ప్రారంభం కాగా.. వచ్చే నెల మూడో తేదీ వరకు పలు కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు. పోషకాహారం శ్రేయస్సు కోసం మిల్లెట్‌లతో ఆహారం, స్వస్త్ బాలక్ స్పర్ధ, ఆరోగ్యమైన పిల్లల పోటీ వంటి కార్యక్రమాలు నిర్వ హించాల్సి ఉంటుంది. ప్రతీరోజుకు ఒక కార్యక్రమా న్ని తీసుకుని ఒక్కోరోజు చిన్నారులు, తల్లిదండ్రు లను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించాలి. మిల్లెట్‌ల వినియోగం, ఆరోగ్యంలో వాటి పాత్రను వివరిస్తూ, చిన్నారుల తల్లిదండ్రులతోనే పౌష్టికాహారాన్ని అం గన్‌వాడీ కేంద్రాల్లో తయారు చేయించే కార్యక్రమా లు చేపట్టాలి. సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధు లను భాగస్వామ్యం చేస్తూ పోషకాహార లోపం, పర్యవసనాలు, ఆరోగ్య సమస్యలను వివరిస్తారు. పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో మినుము ల పాత్రను వివరిస్తూ పాఠశాల విద్యార్థులకు పౌష్టి కాహారంపై వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తారు. రక్తహీనత లేకుండా ఏయే ఆహారాల ను తీసుకోవాలనే దానిని వివరిస్తూ, విటమిన్ సీ ఉ పయోగాలను వివరించాల్సి ఉంటుంది. పిల్లల ఎ త్తు, బరువు, కొలతలు సేకరించడం, భుజం కొలత లు తీసుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచడం చేప ట్టాలి. పౌష్టికాహారం అందించడంలో తల్లి పాత్రనే కాదు, తండ్రి పాత్ర అని కూడా తెలియజేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటల పోటీలు నిర్వహించి, పోషకమైన ఆహార వంటకాలను తయారు చేసేలా ప్రోత్సహించనున్నారు.

జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులు

ప్రాజెక్టు	చిన్నారులు	తక్కువ బరువు ఉన్న పిల్లలు	ఎత్తుకు తగిన బరువు లేనివారు	వయస్సుకు తగిన ఎత్తు లేని చిన్నారులు
బెల్లంపల్లి	11,132	199	154	695
లక్సెట్టిపేట	8,086	314	222	913
చెన్నూరు	8,458	461	366	1,407
మంచిర్యాల	13,904	360	271	602
మొత్తం	41,580	1,334	1,013	3,841

జిల్లాలో

అంగన్‌వాడీ కేంద్రాలు	: 969
చిన్నారులు	: 41,580
గర్భిణులు	: 4,701
బాలింతలు	: 5,672

15 రోజులు నిర్వహిస్తాం



జిల్లా వ్యాప్తంగా అం గన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్‌ను పుర స్కరించుకుని ప్రతీరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తాం. అంగన్‌వాడీ టీచర్లకు కంటి వెలుగు విధులు కేటాయించినా, 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. చిన్నారుల్లో పౌష్టి కాహార లోపం లేకుండా తీసుకోవాల్సిన చర్య లు వివరిస్తాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి

భట్రాచార్యకు ఉగాది పురస్కారం


మంత్రి చేతుల మీదుగా పురస్కారం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల విశ్వనాథస్వామి దేవస్థానం అర్చకుడు గోవర్ధనం భట్రాచార్య ఉగాది పురస్కారం అందుకున్నారు. బుధవారం హైద రాబాద్ రవీంద్రభారతీలో నిర్వహించిన కార్యక్ర మంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్నాయి వాయిద్యకారుడికి ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయ ణస్వామి ఆలయంలో పనిచేస్తున్న సన్నాయి వాయి ద్య కళాకారుడు మోతుక్కారి శ్రీనివాస్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతీలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

30 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు

- జీఎం బీ సంజీవరెడ్డి
- ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం


ఫిజియోథెరపీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: ఆర్కే 8 కాలనీ డిస్పెన్సరీని 30 పడ కల ఆస్పత్రిగా మార్చేందుకు కార్పొరేట్‌కు ప్రతిపా దనలు పంపించినట్లు శ్రీరాంపూర్ జీఎం బి.సం జీవరెడ్డి తెలిపారు. ఆర్కే 8కాలనీ డిస్పెన్సరీలో రూ.8.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లా డుతూ కీళ్లు, నడుం నొప్పి, ఇతర నరాలకు సంబం ధించిన అనేక జబ్బులు నయం కావడానికి ఫిజియోథెరపీ ఎంతో చక్కగా పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఫిజియోథెరపీ అవసరం ఉన్న వారు రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. స్థానికంగా అందు బాటులో ఉండడం వల్ల ప్రైవేటు సెంటర్లకు వెళ్లా ల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, గుర్తింపు సం ఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం బ్రాంచీ అధ్య క్షుడు అబ్దుల్‌ఖాదీర్, డీవైసీఎంఓ రమేష్‌బాబు, డీజీఎం(పర్సనల్) అరవిందర్‌రావు, ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి, డీజీఎంలు శివరావు, సోమశేఖర్, ఇంచార్జీ సేఫ్టీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యులు వేదవ్యాస్, మురళీధర్, స్వప్న, హెల్త్ ఆఫీసర్ లోక్ నాథ్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ రమేష్ పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో జాబ్‌మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. రిన్యూ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ఫిట్టర్ పూర్తి చేసిన అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సం ప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ ఆణిముత్యం.. మౌనిక

- 'జాతీయస్థాయి'కి ఎంపిక
- బరేలిలో ప్రారంభమైన పోటీలు


ఎం.మౌనిక

నార్నూర్: ఓ వైపు నిరుపేద కుటుంబం.. మరోవైపు సౌకర్యాలు సైతం అంతంతే.. అయినా హ్యాండ్‌బాల్ క్రీడపై ఉన్న మక్కువతో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతోంది ఈ విద్యార్థిని. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటగా తాజాగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది మండలకేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.మౌనిక. ఈ నెల 22 నుంచి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీఈటీ అనూష తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మౌనికను ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ యువతి జుగ్నక్ రేణుక మృతికి కారకుడైన లావుడ్యా రమేష్‌కు వెంటనే ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆదిలా బాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల మహిళలపై అత్యాచారాలు, హత్యలు, యాసిడ్ దాడులతో పాటు వరకట్న వేధింపులు, భ్రూణహత్యలు యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. జుగ్నక్ రేణుక నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరణిస్తే కనీసం పోస్టుమార్టం చేయకుండా శవాన్ని ఎలా బయటకి తెస్తారని ప్రశ్నించారు. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దర్యాప్తు చేసి మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షులు ఉయిక ఇందిరా, నాయకులు ఆత్రం శేషు, మడావి గణేష్, బి.రా హుల్, మెస్రం గంగాదేవి, కుంరం శాంతబాయి, ఆత్రం గణపతి, వేడామ ముకుంద్ పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచి అమలు
- కుమురంభీంలో 149 మంది, మంచిర్యాల జిల్లాలో 118 మందికి మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

పెంచికల్‌పేట్/పాతమంచిర్యాల: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ జీవో 11ను జారీ చేసింది. ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ నుంచి పెంచిన వేతనాలను అమలు చేయనున్నారు. సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కేడర్లుగా విభజించి పేస్కేల్ అమలు చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై ఏళ్ల క్రితం నియామకం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవనోపాధిని పెంపొందించడంలో సెర్ప్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇరవై ఏళ్ల కిత్రం ప్రభుత్వం వీరిని నియమించారు. ఏళ్లుగా వీరు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను చైతన్యపరిచి, వారికి సంఘాలు ఏర్పాటు చేయడం, సమావేశాలు నిర్వహించడం, బ్యాంకుల నుంచి రుణాలను అందించడం, రుణాల రికవరీలోనూ వీరి సేవలు విలువైనవి. కుమురంభీం జిల్లాలో ఏపీడీగా ఒకరు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లుగా ఐదుగురు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లుగా 19 మంది, కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా 40 మంది, మాస్టర్ బుక్ కీపర్స్‌గా 25 మంది, అడ్మిన్ అసిస్టెంట్‌లుగా 8 మంది, మండల సమాఖ్య కోఆర్డినేటర్‌లుగా 51 మంది పనిచేస్తున్నారు. అలాగే మంచిర్యాల జిల్లాలో 118 మంది గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో పనిచేస్తున్నారు. వీరిలో ఎంఎస్ సీసీలుగా 30 మంది, రికార్డు అసిస్టెంట్‌లు 09 మంది, ఎంబీకేగా ఒకరు, సీసీలు 52 మంది, ఏపీఎంలు 21మంది, డీపీఎంలు 04, ఏపీడీగా ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు.

పేస్కేలు ఇలా

ప్రాజెక్టు మేనేజర్స్	రూ. 51,230	-	రూ.1,27,310
జిల్లా ప్రాజెక్టు మేనేజర్స్	రూ.42,300	-	రూ.1,15,270
అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్స్	రూ.32,810	-	రూ.96,890
కమ్యూనిటీ కోఆర్డినేటర్	రూ.24,280	-	రూ.72,850
మాస్టర్ బుక్ కీపర్స్	రూ.22,240	-	రూ.67,300
అడ్మిన్ అసిస్టెంట్‌లు	రూ.24,280	-	రూ.72,850
మండల సమాఖ్య కోఆర్డినేటర్స్	రూ.19,000	-	రూ.58,850

ఏప్రిల్ నుంచి అమలు..

ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి పేస్కేల్ అమలు చేయాలని నిర్ణయించింది. కనిష్ఠంగా రూ.19వేల నుంచి రూ.58,850 కాగా, గరిష్ఠ పేస్కేల్ రూ.51,320 నుంచి 1,27,310లుగా నిర్ణయించారు. జిల్లాలోని 149 మంది సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ అమలుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



20 ఏళ్లుగా తక్కువ జీతంతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం పేస్కేల్ అమలు చేయడం హర్షనీయం. ప్రభుత్వాలు మారినా ఏళ్లుగా తమ సమస్యను పట్టించుకోలేదు. మాకు పేస్కేల్ వర్తింపజేయడంతో కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఏళ్ల పాటు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది.

– కడతల రమేశ్, సెర్ప్ జేఏసీ జిల్లా కన్వీనర్, కుమురంభీం

బహుజన రాజ్య స్థాపనే లక్ష్యం


కండువా కప్పుతున్న సందీప్

కైలాస్‌నగర్: బహుజనుల రాజ్యాధికార స్థాపనే లక్ష్యంగా వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందీప్ దాంఢ్గే అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదివే నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడారు. అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వంచిత్ బహుజన్ అఘాడి పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అంబేద్క ర్ ఆశయాలు నెరవేర్చడమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం మహిళా అఘాడి కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మహిళా అఘా డి జిల్లా అధ్యక్షులు వర్ష కాంబ్లె, ఆదిలాబాద్ ని యోజకవర్గ ఇన్‌చార్జి పంచశీల్ గుళవే పాల్గొన్నారు.

వడ్రంగి దుకాణంలో అగ్ని ప్రమాదం

కుంటాల(ముధోల్): మండలంలోని ఓలా గ్రామానికి చెందిన వెల్పూర్ రంజిత్ వడ్రంగి దుకాణంలో బుధవారం తెల్లవారుజామున అ గ్నిప్రమాదం సంభవించింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో విద్యుత్ మీటర్, కర్రతో పాటు రూ. లక్ష విలువ చేసే సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. ఘటన స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు.

ఇప్పుడే వస్తానని వెళ్లి మృత్యువాత

- రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- పండుగ పూట విషాదం


సంఘటన స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భీమిని: ఇప్పుడే వస్తానని ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఉగాది పండుగ పూట కన్నవారికి కడుపు కోత మిగిల్చాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రెబ్బెన గ్రామానికి చెందిన గోమాస భీమయ్య, గౌతమి దంపతులకు ఐదుగురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గోమాస రఘు(17) ద్విచక్ర వాహనంపై కిరాణ దుకాణం ప్రారంభానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రెబ్బెన–కుశ్నపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రఘు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, మరో మోటార్ సైకిల్‌పై ఉన్న ఉంద్రుగుల ప్రసాద్, గోమాస రవి గాయపడ్డారు. ప్రసాద్ కుడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

మైనర్ల వేగం.. పెద్దలకు శోకం..!

- మోటార్‌సైకిళ్లపై దూసుకెళ్తున్న బాలలు
- తల్లిదండ్రులు, పోలీసులు దృష్టి సారిస్తేనే భద్రత


త్రిబుల్ రైడ్ చేస్తున్న మైనర్లు

నెన్నెల: ఏ తల్లిదండ్రులకైనా పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమో.. అవగాహన రాహిత్యమో గానీ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తూ సంబర పడిపోతున్నారు. కంటిపాపల్లా కాపాడుకోవాల్సిన బాలలను ప్రమాదంలో పడేయడంతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. బుధవారం కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామంలో బాలుడు(17) అతివేగంగా మోటార్‌సైకిల్ నడిపిస్తూ వెళ్లి ఎదురుగా వచ్చిన మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో మరో మోటార్‌సైకిల్‌పై ఉన్న యువకుడికి కాలు విరిగింది. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల్లో జరిగే ప్రతీ నాలుగు ఐదు రోడ్డు ప్రమాదాల్లో ఒకటి మైనర్ల వల్లేనని గణంకాలు చెబుతున్నాయి. నేటి సాంకేతిక యుగం పిల్లలు వాహనాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు వద్దని చెబుతున్నా వినకుండా నడిపిస్తున్నారు. దీంతో తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడంతోపాటు తల్లిదండ్రులకు శోకం మిగుల్చుతున్నారు. మరికొందరు తల్లిదండ్రులు స్వయంగా డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. ఇటీవల పల్లెలు, పట్టణాల్లో బాలురు వాహనాలు నడపడం ఎక్కువగా కనిపిస్తోంది. సైకిళ్లు నడపాల్సిన వయస్సులో ద్విచక్ర వాహనాలపై పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. తల్లిద్రండులే పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాలు, మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేయాలని పంపిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులైతే తమ కుమారుడు వాహనం నడుపుతున్నాడని గర్వంగా చెప్పుకుంటున్నారు. పిల్లలకు వాహనం ఇవ్వడం నేరమని తెలిసి తప్పు చేస్తున్నారు. పిల్లలు ద్విచక్ర వాహనంపై వాయువేగంతో వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే కొంతవరకు ప్రమాదాలు నివారించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే ప్రమాదాల బారిన పడి ఇబ్బందులు పడక తప్పదు అని తల్లిదండ్రులు గ్రహించాలి. వాహనాలతో పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు రాకుండా విద్యాసంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలి. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే కొంత మేర ప్రమాదాలు తగ్గుతాయి. మైనర్లు ప్రమాదానికి గురి చేస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు. జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది. రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంటుంది. ఇది గ్రహించి తల్లిదండ్రులు ఆలోచించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ప్రభుత్వ భూమి కబ్జాపై పట్టింపేది..!

- కిష్టాపూర్ గ్రామంలో వెలిసిన ప్లాట్లు
- గుడిసెలు వేసేందుకు యత్నం
- సింగరాయిపేట ఆక్రమణదారులపై వేటుకు ఆందోళన
- ఎస్సై నర్దిచెప్పడంతో గ్రామస్తుల వాయిదా


భూమిలో గుడిసెలు వేసుకుంటున్న కిష్టాపూర్ గ్రామస్తులు

జన్నారం: ప్రభుత్వ భూములు, చెరువు భూముల కబ్జాలపై అధికారులకు పట్టింపు కరువైంది. ఆక్రమణలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అధికారుల తీరుపై నిరసనకు సిద్ధం అవుతున్నారు. ఒక గ్రామానికి చెందిన వారు ప్రభుత్వ భూమిలో ప్లాట్లు ఏర్పాటు చేసి గుడిసెలు వేసుకునేందుకు సిద్ధం అవుతుండగా, సింగరాయిపేట గ్రామ శివారులోని చెరువు భూమి అక్రమ పట్టా చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తపాలపూర్ గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు రాస్తారోకో, ఆందోళనలకు సిద్ధం అవుతున్నారు.

విచారణ సరే.. చర్యలేవి..?

సింగరాయిపేట గ్రామ చెరువులో శిఖం భూమి సర్వే నంబర్ 147/11, 147/6లో 7.20 ఎకరాలు అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి కుటుంబీకుల పేర్లతో అక్రమ పట్టా చేసుకున్నారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి అక్రమ పట్టా అని తేల్చినా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 24న ఆందోళన నిర్వహణకు తీర్మానించారు. కిష్టాపూర్ శివారులోని సర్వే నంబర్ 139/అ1/1లో రెండెకరాలు కిష్టాపూర్ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపిస్తూ ఇదివరకే ఆ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కిష్టాపూర్ చెరువు శిఖం భూమి కూడా సర్వేనంబర్ 298/ఆలో 6.13 ఎకరాలు, 298/ఇ లో 0.30 ఎకరాల భూమిని మరో అధికార పార్టీకి చెందిన నాయకుడు అక్రమ పట్టా చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు విచారణ చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ భూమిలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొందరు బుధవారం ఉగాది రోజున 30 ప్లాట్లు 30 మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

గుడిసెలు వేసే అవకాశం

కిష్టాపూర్ పల్లె ప్రకృతి వనం ఎదురుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకునేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. అధికార పార్టీ నాయకుడు వారి కుటుంబీకుల పేరున అక్రమ పట్టా చేయించుకుని రైతుబంధు పొందుతున్నాడని ఆరోపిస్తున్నారు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలేని, లేనిపక్షంలో గుడిసెలు వేసుకుంటామని కిష్టాపూర్‌కు చెందిన దళిత నిరుపేదలు బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో ప్రయత్నించారు. తహసీల్దార్ వెంకటకిషన్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై తానాజీనాయక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు సర్ది చెప్పి.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించడంతో నిర్మాణం నిలిపారు. అధికారులు సమస్య పరిష్కరించని పక్షంలో ఇళ్లు నిర్మించుకుంటామని స్పష్టం చేశారు.

కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించుకున్నా ఊరుకునేది లేదు. పల్లె ప్రకృతి వనం ఎదురుగా భూమిని ఐటీఐ నిర్మాణం కోసం కేటాయించాం. అక్రమ పట్టా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణ చేస్తున్నాం. తొందరపడి ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తే ఎవరైనా కేసులు నమోదు చేయిస్తాం.

– వెంకటకిషన్, తహసీల్దార్

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

కౌటాల(సిర్పూర్): బైక్ ఢీకొని బాలుడు గాయపడిన ఘటన బుధవారం కౌటాలలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి చెందిన దండిక వెంకటేశ్– కృష్ణవేణి దంపతులు బుధవారం చిన్న కుమారుడు విక్కితో కలిసి స్థానిక కోదండ రామాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి వెళ్తుండగా కౌటాల– బెజ్జూర్ రహదారి దాటుతున్న విక్కిని సదా శివపేట నుంచి కౌటాలకు వెళ్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విక్కి కుడి కాలు విరగగా, తలకు బలమైన గాయమైంది. అలాగే బైక్‌పై ఉన్న చకినల ఉమేశ్ స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. విక్కిని తల్లిదండ్రులు వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలకు తరలించారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు


బాలికను సఖి కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

కుంటాల(ముధోల్): అభం శుభం తెలియని పట్టుమని పదేళ్లు కూడా నిండని బాలికకు నిశ్చితార్థం జరిపించిన ఘటన మండలంలోని ఓలా గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా మద్దికుంట గరుగుల్ గ్రామానికి చెందిన శ్యామల–రాజు దంపతుల కుమార్తె(10)ను కుంటాల మండలంలోని ఓలా గ్రామానికి చెందిన యువకుడి(18)తో వివాహం జరిపించేందుకు పెద్దలు నిశ్చయించారు. బుధవారం వివాహం జరిపించేందుకు సిద్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎస్సై సాయి కిరణ్, సర్పంచ్ ఫాతిమా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను నిర్మల్ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు.

బాసర ఆలయంలో ఉగాది వేడుకలు


పంచాంగం ప్రదర్శిస్తున్న అర్చకులు

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మ వారి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆలయ వైదికులు బ్రహ్మ ముహూర్తంలో అమ్మవార్లకు వివిధ ఓషధులతో విశేష అభిషేకం, మహా నీరాజన మంత్రపుష్ప సేవ పంచాంగ బ్రహ్మధ్వజ పూజలు చేశారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు.

'శోభకృత్ శుభాలు చేకూర్చాలి'

శోభకృత్ నామ సంవత్సరం అందరికీ శుభాలు చేకూర్చాలని ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆశించారు.

బాసర ఆలయంలో పంచాంగ శ్రవణం

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్తులు, భక్తులు ఉన్నారు.

మూడోసారీ వాయిదా..

- మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి కౌన్సిలర్ల గైర్హాజరు
- అవిశ్వాసానికి దారితీస్తుందని గుసగుసలు
- చర్చనీయాంశంగా మారిన ఖానాపూర్ మున్సిపల్ తీరు..


హాజరైన చైర్మన్, కమిషనర్, అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ రాజకీయాలు కొత్త మలుపులకు దారి తీస్తున్నాయి. నెలరోజుల్లో వరుసగా మూడోసారి బడ్జెట్ సమావేశం వాయిదా పడడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ మినహా కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు సైతం గైర్హాజర్ కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 30కి పైగా మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు తెరలేపారు. ఖానాపూర్‌లో సైతం కౌన్సిలర్ల గైర్హాజరు తీరు అవిశ్వాస తీర్మానానికి దారితీస్తుందని చర్చలు జోరుగా సాగుతున్నాయి. పది రోజుల వ్యవధిలో మూడు సార్లు సమావేశం వాయిదా పడింది. మొదట ఈ నెల 9న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడింది. రెండోసారి 18న ప్రతిపక్ష, అధికార పార్టీ కౌన్సిలర్లు రాకపోవడంతో వాయిదా పడింది. ఈ నెల 21న మంగళవారం సైతం మూడోసారి జరగాల్సిన సమావేశానికి చైర్మన్‌తో పాటు కమిషనర్, సంబంధిత అధికారులు మాత్రమే హాజరుకావడంతో సమావేశం వాయిదా పడింది. కాగా ప్రతీ సంవత్సరం మార్చిలో నిర్వహించాల్సిన అత్యంత ముఖ్యమైన వార్షిక బడ్జెట్ సమావేశానికి సభ్యుల గైర్హాజరు కావడంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ విషయమై కమిషనర్ రత్నాకర్ రావును వివరణ కోరగా కోరం లేని కారణంగా సమావేశాలన్నీ వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు మాత్రం గతంలో వరుసగా జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేటాయించిన నిధుల ఖర్చు వివరాలు తెలపకపోవడంతోనే గైర్హాజర్ అవుతున్నామని ప్రకటిస్తున్నారు.

ప్రతిపక్ష, స్వపక్షాలదీ అదేబాట..

ఖానాపూర్‌లో ప్రతిపక్ష కౌన్సిలర్లతో పాటు స్వపక్ష కౌన్సిలర్లు కూడా బడ్జెట్ సమావేశానికే గైర్హాజరు అవుతున్నారు. మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో ప్రస్తుతం అధికార బీఆర్‌ఎస్‌కు ఏడుగురు, కాంగ్రెస్‌కు నలుగురు, బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. రెండోవార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. కోఆప్షన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేయడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు రెండవ వార్డు కౌన్సిలర్‌ను పదవి నుంచి తొలగించాలని హైకోర్టులో కేసు వేశారు. దీంతో అవిశ్వాసానికి దారితీసినట్టేనా? అని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

మద్యానికి బానిసగా మారి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కూచర్ల సాయిరాజ్(30) మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాజ్‌కు ఐదేళ్ల క్రితం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కూచర్ల సవితతో వివాహం జరిగింది. గత కొంతకాలంగా సాయిరాజ్ మద్యానికి బానిసగా మారి ఏ పనీ చేయడం లేదు. నిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భరించలేని ఆయన భార్య పలుమార్లు మందలించింది. అతడిలో మార్పు రాకపోవడంతో గతేడాది క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన భార్యను కాపురానికి రావాలని పలుమార్లు కోరాడు. మద్యం సేవించడం మానేస్తేనే వస్తానని చెప్పడంతో మనస్తాపం చెంది సాయిరాజ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వసంత్ తెలిపారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్


నీలం సంపత్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల (ప్రస్తుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ప్రిన్సిపాల్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నీలం సంపత్ కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఈనెల 23న డాక్టరేట్ పట్టా పొందనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం నుంచి ఆహ్వానం అందుకున్నారు. యూనివర్సిటీకి చెందిన వాణిజ్య విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిలు పర్యవేక్షణలో సంపత్ కుమార్ 'మార్కెటింగ్ ఆఫ్ పేపర్ ఇన్ ఇండియా– ఎ స్టడీ ఆఫ్ ది సిర్పూర్ పేపర్ మిల్లు'అనే అంశంపై పరిశోధనలు చేశారు.